

సాక్షి
పల్నాడు

శనివారం ၊ 31 ၊ మే ၊ 2025



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వానకు నగరంలో రహదారులన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముడి వెండి సమర్పణ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి తెనాలికి చెందిన కడియాల సుధీర్ కుటుంబం రూ. 3.50 లక్షల విలువైన 3.6 కేజీల ముడి వెండిని సమర్పించింది.

న్యూస్‌రీల్

అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

– డీలర్లకు జిల్లా పౌర సరఫరాల అధికారి హెచ్చరిక

నరసరావుపేట టౌన్: చౌక దుకాణ డీలర్‌లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. నారదముని శుక్రవారం హెచ్చరించారు. జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల వద్ద కార్డుదారులకు నిత్యావసరాల సరకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8–మధ్యాహ్నం 12, సాయంత్రం 4 – రాత్రి 8 గంటల వరకు చౌక దుకాణాలు తెరిచి ఉంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పరమైన స్టాక్ బోర్డ్, కార్డుదారులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకుల వివరాలను డీలర్ అందుబాటులో ఉంచాలన్నారు. చౌక దుకాణ పరిధిలోని వృద్ధులు, దివ్యాంగులకు ఆయా డీలర్‌లు ఇంటి వద్దకే వెళ్లి సరకులు అందించాలని పేర్కొన్నారు. నియమ నిబంధనలు, నిర్దేశించిన సమయాలను తప్పక పాటించాలన్నారు. పంపిణీ సమయంలో సంబంధిత సీఎస్‌డీటీ ఆయా చౌక దుకాణాలను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలిస్తారన్నారు. అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జవహర్ నవోదయ కోసం స్థల పరిశీలన


బల్లికురవ: కేంద్ర ప్రభుత్వం అద్దంకి నియోజకవర్గానికి జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసింది. విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి రెవెన్యూ అధికారులు శుక్రవారం అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. విద్యాలయం ఏర్పాటుకు 25 ఎకరాల భూమి కావాల్సి ఉంది. బల్లికురవ తహసీల్దార్ రవినాయక్ వల్లాపల్లి గ్రామంలోని పేరంటాళ్ల తల్లి ఆలయం సమీపంలో, గుంటుపల్లి గ్రామంలోని సచివాలయం సమీపంలో భూములను పరిశీలించారు. జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

కోన నీరజకు టైమ్స్ పవర్ ఉమెన్ అవార్డు



బాపట్ల: సినీ ఇండస్ట్రీలో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌గా, దర్శకురాలుగా పనిచేస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కుమార్తె కోన నీరజకి ది టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకమైన టైమ్స్ పవర్ ఉమెన్ అవార్డు దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాదులో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. సినీ ఇండస్ట్రీలో వెలుగొందడంతో పాటు పుస్తక రచయితగా, దర్శకురాలుగా ఆమె శక్తివంతమైన మహిళగా రూపుదిద్దుకుంటున్నారని ది టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ కొనియాడింది. ఈ సందర్భంగా కోన రఘుపతి తన కుమార్తెకు శుభాకాంక్షలు తెలియజేశారు. నీరజ అవార్డు అందుకోవడం బాపట్ల ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఏఎన్‌యూ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్సిటీ యోగా సెంటర్‌లో సాధన చేశారు. యోగా ఆవశ్యకతను వీసీ తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య పీఎస్ పాల్ కుమార్, ఆచార్య పి.సిద్దయ్య, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య కె.మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత

ఫిరంగిపురం: ఫిరంగిపురం – సత్తెనపల్లి మార్గంలోని అల్లంవారిపాలెం వద్ద ఉన్న రైల్వే గేటు ఎల్‌సీ 298కి శనివారం నుంచి అత్యవసర మరమ్మతులు నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ నల్లపాడు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పి. ఉమా మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం నుంచి జూన్ 3వ తేదీ వరకు గేటు మూసివేస్తామన్నారు. ప్రత్యామ్నాయంగా ఆరోగ్య నగర్ వద్ద ఉన్న అండర్ పాస్‌ను వాహనదారులు వినియోగించుకోవాలన్నారు.

నాడు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో లబ్ధి కలిగించారు. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి వివక్ష చూపకుండా లబ్ధిదారులను ఎంపిక చేశారు. స్థానిక నేతల ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు వలంటీర్లు ఇంటికే వచ్చి పథకానికి అర్హత పొందేలా చేశారు. ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు అయ్యేవి. ఏదైనా కారణంతో పింఛన్ నగదు అందకపోతే ద్వైవార్షిక లబ్ధి పేరిట ఆరు నెలల మొత్తం చెల్లించారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి ఆప్యాయంగా పలకరించి,లబ్ధిదారులకు నగదు ఇచ్చి వారి యోగక్షేమాలు తెలుసుకొనేవారు.

నేడు...

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా జిల్లాలో ఒక్కటంటే ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు కాలేదు. కనీసం ఎప్పుడు, ఎలా, ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో చెప్పేవారుకూడా లేరు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా లక్షల మంది పింఛన్ పథకానికి అన్ని అర్హతలు ఉండీ ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇంటికే పింఛన్ నగదు అందజేసే వలంటీర్ల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పక్కనపెట్టడంతో సచివాలయ ఉద్యోగులపై భారం పెరిగింది. వీధుల్లో నిలబడి పింఛన్లు అందిస్తున్నారు. కొత్తవి ఇవ్వకపోగా ఉన్న పింఛన్లను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే నెపంతో కూటమి ప్రభుత్వం తొలగిస్తోంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పేదల పింఛన్లకూ కూటమి కోత

ఏడాది పాలనలో పింఛనుదారులకు అష్టకష్టాలు

- అధికారంలోకి వచ్చాక కొత్తగా ఒక్కటీ ఇవ్వకపోగా ఉన్న వాటిలోనూ కోత
- ఆశగా ఎదురుచూస్తున్న లక్షలమంది అర్హులు
- ఏడాది పాలనలో జిల్లా వ్యాప్తంగా 11,893 మందికి పింఛన్లు రద్దు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికొదిలేసిన వైనం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు
- మరోసారి చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి మోసపోయిన పేదలు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో అర్హత కలిగిన వారందరికీ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఎన్నికల ప్రచారంలో నేతలు వాగ్దానాలు చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదైనా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు సర్కార్ పింఛన్ ఇస్తుందని ఆశపడిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలను నిండా మోసం చేశారు. బాబు మోసాలపై గత అనుభవాలు తెలిసినా సూపర్–6 పథకాల పేరిట అరచేతిలో వైకుంఠం చూపడంతో ఓటేసిన ప్రజలకు మరోసారి వెన్నుపోటు తప్పలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్‌కు అర్హత కల్పించి ఉంటే నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికిగాను ఒక్కొక్కరికి రూ.48 వేల వంతున ఆర్థిక సహాయం ప్రభుత్వం నుంచి అంది ఉండేది. కూటమి ప్రభుత్వం తీరుతో జిల్లాలో సుమారు 2 లక్షల మందికిపైగా అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దీన్ని అమలు చేయకపోవడంతో జిల్లాలో అర్హులైన వారు ఏడాదికి సుమారు రూ.960 కోట్ల మేరకు లబ్ధి పొందలేకపోయారు.

ఏడాదిలో 11,893 పింఛన్ల కోత

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న వాటికి మంగళం పాడుతోంది. అనర్హుల ఏరివేత పేరిట టీడీపీకి అనుకూలంగా ఓటేయని వారందరినీ లక్ష్యంగా చేసుకుంది. ఏకంగా గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన సామాజిక పింఛనుదారులకు సైతం నోటీసులు పంపి, అర్హత నిరూపించుకోవాలని చెబుతోంది. లేకపోతే అనర్హులుగా ప్రకటిస్తామని రీ వెరిఫికేషన్ పేరిట ఎంపీడీఓలతో నోటీసులు ఇప్పిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా సామాజిక పింఛన్ల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఎవరో ఓ టీడీపీ నేత తమ పరిధిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల లిస్ట్ అందజేస్తే వారందరికీ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. నోటీసు అందుకున్న ఒంటరి మహిళలు కూడా తహసీల్దార్ ద్వారా ధ్రువీకరణ పొంది ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొంటున్నారు. దివ్యాంగులైతే మరోసారి వైద్యుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని సమర్పించాలని అడుగుతున్నారు. ఇలా గతంలో ఎన్నడూ లేని విధంగా నోటీసులు ఇవ్వడం పట్ల ప్రజలు, ప్రజా సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు గతేడాది జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. జూన్‌కు సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన 2,82,126 మంది లబ్ధిదారులకే జూలై నెలకు పింఛన్ మంజూరైంది. ప్రస్తుతం ఈ సంఖ్య 2,70,233కు చేరింది. గత ఏడాదిలో లబ్ధిదారుల సంఖ్య 11,893 తగ్గింది. ప్రభుత్వ చర్యల వల్ల అర్హులైన తమకు పింఛన్లు అందలేదని బాధితులు వాపోతున్నారు.





అన్యాయంగా పింఛన్ల రద్దుపై శావల్యాపురం ఎంపీడీఓను కలవడానికి వచ్చిన కనమర్లపూడి వాసులు (ఫైల్)

పల్నాడు జిల్లాలో గతేడాది జూలై నుంచి తగ్గుతూ వస్తున్న పింఛన్ల సంఖ్య వివరాలు

నియోజకవర్గం	జూలై-2024	నవంబరు-2024	జనవరి-2025	మే-2025
చిలకలూరిపేట	37,982	37,090	36,900	36,428
గురజాల	44,026	42,921	42,675	42,168
మాచర్ల	43,520	42,370	42,099	41,628
నరసరావుపేట	33,622	32,824	32,666	32,234
పెదకూరపాడు	40,264	39,248	39,020	38,580
సత్తెనపల్లి	40,559	39,538	39,340	38,846
వినుకొండ	42,153	41,079	40,830	40,349
మొత్తం	2,82,126	2,75,070	2,73,530	2,70,233

కొత్త పింఛన్లు ఏవి..?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. అర్హతే ప్రామాణికంగా ఏటా జనవరి, జూలై నెలల్లో ఎటువంటి సిఫార్సు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరిగేది. గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా, ఎవర్నీ కలవాల్సిన అవసరం రాకుండా పింఛన్‌కు అర్హత సాధించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో ఒక్కటంటే ఒక్క పింఛన్‌కు కూడా మంజూరు చేయలేదు. అన్ని అర్హతలున్నా ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కనీసం ఎప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తారో కూడా చెప్పలేని దుస్థితి నెలకొనడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు గ్రామ, వార్డు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మళ్లీ పాత చంద్రబాబును చూస్తారంటూ సీఎం అప్పుడప్పుడు చెబుతుంటారు. అంటే పింఛన్ కావాలంటే పచ్చ నేతల కమిటీల చుట్టూ తిరగాలేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అన్యాయంగా తొలగింపు



ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదు. అర్హులైన వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. కొత్త పింఛన్ ఒక్కటి కూడా ఇవ్వకపోగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే అక్కసుతో అర్హులైన పేదల పింఛన్లను కూడా తొలగిస్తున్నారు. ఒక్క శావల్యాపురం మండల పరిధిలోనే ఇలా వందల సంఖ్యలో పింఛన్లు అన్యాయంగా తొలగించారు.

– బోదేపూడి కొండలు, శావల్యాపురం, వినుకొండ నియోజకవర్గం

అర్హత ఉన్నా ఇవ్వడం లేదు



నా భర్త వృద్ధాప్య పింఛన్ తీసుకునేవారు. అనారోగ్య కారణాల వల్ల మరణించారు. నాకు పింఛన్ ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. కొత్త పింఛన్లు మంజూరు కాలేదని, ఎవరైనా మరణిస్తే ఇస్తామని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. భర్త చనిపోయారని, ఆ స్థానంలోనైనా నాకు ఇవ్వమంటే పట్టించుకునేవారే లేరు. 65 ఏళ్ల వయసులో పింఛన్ వస్తే ఆసరాగా ఉంటుంది. ఇప్పటికే బతుకు భారమైంది.

– పెరికల చెన్నమ్మ, మూసాపురం, పెదకూరపాడు మండలం

బాలలకు విచ్చలవిడిగా మద్యం సరఫరా

- నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు
- యథేచ్ఛగా పర్మిట్ రూముల ఏర్పాటు
- మైనర్లకు మద్యం సరఫరా చేస్తున్న వైనం
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

నరసరావుపేట టౌన్: ఉజ్వలంగా వెలగాల్సిన విద్యార్థుల జీవితాలు కూటమి ప్రభుత్వ ధనదాహం, అధికారుల మామూళ్ల మత్తులో చిత్తవుతున్నాయి. వైన్ షాపు నిర్వాహకులు కక్కుర్తితో టీనేజ్ కూడా దాటని పిల్లలతో బహిరంగంగా మద్యం తాగిస్తున్నారు. పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినా.. ఏకంగా కుర్చీలు, బల్లలు వేసి పిల్లలకు మద్యం సరఫరా చేస్తూ వారి జీవితాలను చీకట్లోకి నెట్టేస్తున్నారు.

జీవితాలతో చెలగాటం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి తీసుకెళ్లింది. వారికి టార్గెట్లు ఇచ్చి మరీ మద్యం అమ్మకాలకు తెరతీసింది. ఈ క్రమంలో వైన్స్ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్లు మద్యం విక్రయాలు చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతులు లేకుండానే పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తున్నారు. వేళాపాళా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు.



నరసరావుపేటలోని ఓ వైన్స్‌లో మద్యం తాగుతున్న మైనర్లు

ఆదాయమే పరమావధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాలను సర్కారే నిర్వహించేది. ఆ క్రమంలో ప్రజలను మద్యానికి దూరం చేసేందుకు ప్రయత్నం చేసింది. తద్వారా యువత మద్యం జోలికి వెళ్లకుండా కట్టడి చేయగలిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చివరకు మైనర్లకు కూడా మద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. నరసరావుపేట రావిపాడు రోడ్డులోని ఓ వైన్ షాపులో అనుమతులు లేకుండానే పర్మిట్ రూము ఏర్పాటు చేశారు. ఇక్కడ 18 ఏళ్లు కూడా నిండని బాలలు మద్యం తాగుతూ కనిపించారు. మైనర్లకు మద్యం విక్రయించరాదనే నిబంధనలను నిర్వాహకులు తుంగలో తొక్కారు. వీటిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైల్వే గడ్డర్‌ను ఢీకొన్న భారీ వాహనం

తాడేపల్లి రూరల్: సీతానగరం రైల్వే ట్రాక్ వద్ద ఏర్పాటుచేసిన రైల్వే గడ్డర్‌ను ఓ భారీ వాహనం ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం రైల్వేట్రాక్ అండర్ పాస్ వద్ద భారీ వాహనాల రాకపోకల నిషేధానికి ఏర్పాటు చేసిన రైల్వే గడ్డర్‌ను చూసుకోకుండా వాహన డ్రైవర్ ఢీకొట్టాడు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ రైల్వే గడ్డర్‌ను తరచూ భారీ వాహనాలు ఢీకొంటున్నాయని, సరైన సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

సేవల్లో 'ఫ్లోరెన్స్ నైటింగేల్'

- రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ స్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న వలివేటి శుభావతి
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పురస్కారం పొందిన ఏకైక మహిళ

తెనాలి: పవిత్రమైన వైద్యవృత్తిలో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే వృత్తిజీవితంలో సంతృప్తినే కాదు... ఏకంగా రాష్ట్ర, జాతీయ అవార్డులు కూడా వరిస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా శుక్రవారం జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును స్వీకరించిన వలివేటి శుభావతి ఇందుకు చక్కని నిదర్శనం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఈ అవార్డును అందుకున్న ఏకైక మహిళ కూడా శుభావతినే. ఏఎన్ఎం విధుల్లో వైద్యవృత్తి ప్రాధాన్యతను గుర్తెరిగి, అంకితభావంతో నిర్వహిస్తూనే ఉన్నత కోర్సులు చేస్తూ, వరుస పదోన్నతులతో మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్ హోదాకు ఎదిగారు. ఇప్పుడు ఏకంగా జాతీయ అవార్డునే దక్కించుకున్నారు. తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి శుభావతి స్వస్థలం. తల్లిదండ్రులు సీతారావమ్మ, సుబ్రహ్మణ్యం. తొలుత ఉమ్మడి గుంటూరు జిల్లా నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని చందవరం సబ్ సెంటర్‌లో ఏఎన్ఎంగా శుభావతి వృత్తిజీవితం ఆరంభమైంది. ఉద్యోగ బాధ్యతల్లో ఉంటూనే పీజీ కోర్సులు చేస్తూ వచ్చారు. 13 ఏళ్ల సర్వీసులో మూడు పీజీలు చేశారు. ఫలితంగా పదోన్నతిపై ఇదే జిల్లాలోని నకిరేకల్‌లో హెల్త్ ఎడ్యుకేటర్‌గా నియమితులయ్యారు. అక్కడ 12 ఏళ్లపాటు పనిచేశారు. కర్నూలులోని రీజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)కు మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ గత జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు.



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డును స్వీకరిస్తున్న శుభావతి

ఎన్నో అవార్డులు.. రివార్డులు

ఆకాశవాణి, విజయవాడ కేంద్రం ఆహ్వానంపై బాల్య వివాహాలు, మాతాశిశు మరణాలు, బాలికా శిశు సంరక్షణ వంటి కార్యక్రమాలపై శుభావతి ప్రత్యేక ప్రసంగాలు చేశారు. గుంటూరు జిల్లాలో బాల్య వివాహాల నిరోధంపై రిసోర్స్ పర్సన్‌గానూ వ్యవహరించారు. దీనిపై పలు పాటలు రాసి, స్వయంగా గానం చేశారు. అప్పట్లో నెల్లూరు కలెక్టర్ల నుంచి అవార్డులను అందుకున్నారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు జిల్లా కలెక్టర్ సూచనపై ఓటరు అవగాహనపై పాట రాశారు. చెన్నైలో సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్‌తో స్వరకల్పన చేయించారు. ఈ సందర్భంగా నాటి కలెక్టర్ రేఖారాణి ప్రశంసాపత్రం అందించారు. రక్తహీనతపై అవగాహన కోసం పాట రాశారు. శ్రీకాకుళంలో కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ చేసిన సేవలకుగాను అవార్డులు దక్కాయి. గత ప్రభుత్వ హయాంలో శానిటేషన్, న్యూట్రిషన్‌పై శుభావతి రాసిన పాట పేరు పొందింది. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఏఎన్ఎంల పుస్తకంలో తొలి పేజీలోనే ఆ పాటను ముద్రింపజేశారు. ఏపీ కల్చరల్ అవేర్‌నెస్ రాష్ట్రస్థాయి ఉత్తమ పౌరురాలి అవార్డు, శ్రీకాకుళంలో ఆంధ్రరత్న అవార్డు వంటివెన్నో తనకు అలంకారాలుగా మారాయి. భర్త ప్రైవేటు ఉద్యోగి, కుమారుడు హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్‌లో పని చేస్తున్నారు. రిటైరయ్యాక గుంటూరులోనే ఆమె స్థిరపడ్డారు.



వలివేటి శుభావతి

పేద రోగులకు సేవలు

వైద్యరంగంలో తన 39 ఏళ్ల సర్వీసులో శుభావతి పేద ప్రజలు, అవసరమైన వారికి తగిన సేవలను అందిస్తూ వచ్చారు. తన సమర్థత, నిబద్ధతను గుర్తించిన ఉన్నతాధికారులు అప్పగించిన అన్ని బాధ్యతలను ఆమె సక్రమంగా నిర్వర్తించారు. అనేక అవార్డులను అందుకున్నారు. నకిరేకల్‌లో ఉండగా, హెచ్ఐవీ/ఎయిడ్స్ ప్రాజెక్టుపై శుభావతిని నాటి జిల్లా కలెక్టర్ ప్రత్యేక శిక్షణకని ఢిల్లీ పంపారు. అదే ప్రాజెక్టుపై జిల్లాలోని ఆర్ఎంపీ/పీఎంపీలతో సహా ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని డిపార్టుమెంటు ఉద్యోగులకు శుభావతి అవగాహన కల్పించారు. ఆ కృషికి గుర్తింపుగానే అప్పటి రాష్ట్రమంత్రి కొణిజేటి రోశయ్య నుంచి అవార్డును అందుకున్నానని శుభావతి చెప్పారు. ఎక్కడ పనిచేసినా తోటి సిబ్బంది, ప్రజలు ఎంతో ప్రేమను చూపటం తనకు గుర్తుండి పోతుందని పేర్కొన్నారు. 'ఎంతో కష్టపడి పనిచేశాను. అందరి మన్ననలు పొందాను. డబ్బు కోసం ఆశపడలేదు. స్వచ్ఛందంగా బాధ్యతలను నిర్వర్తించాను. జాతీయ అవార్డు లభించిందంటే వృత్తి జీవితం మొత్తానికి అందిన గౌరవంగా భావిస్తున్నాను' అని శుభావతి చెప్పారు.

కూటమి ప్రభుత్వ మోసాలను గుర్తించిన ప్రజలు

- వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్
- వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు

మంగళగిరి: కూటమి ప్రభుత్వం అధికారం కోసం ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, ఆ విషయాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ అన్నారు. జూన్ 4వ తేదీన జరగనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ మభ్య పెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ప్రజలు నమ్మడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని వాటిని కూడా కూడా నెరవేర్చారని, దీనిని ప్రజలు గుర్తించారని చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ కార్యాలయం 15 ఎకరాలలో ఉందని, కొత్త ఇంటిని రూ.కోట్లతో నిర్మిస్తున్న చంద్రబాబు ఎన్ని ఎకరాలలో ఇల్లు కడుతున్నారని ప్రశ్నించారు. చేతిలో మీడియా ఉందని దుష్ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయని హితవు పలికారు.

ప్రజలు తిరగబడే రోజులు దగ్గరకు వచ్చాయి

హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే వెన్నుపోటు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలంతా వెన్నుపోటు దినోత్సవంలో పాల్గొని తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని నమ్మి రాష్ట్ర ప్రజలంతా మోసపోయారన్నారు. మంగళగిరి, గుంటూరు తూర్పు, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు దొంతిరెడ్డి వేమారెడ్డి, నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు, బలసాని కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతిన మహేష్

క్లుప్తంగా

3న కాంట్రాక్టు అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు జూన్ 3వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సరోజిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు-1, సంస్కృతం-1, మ్యాథమెటిక్స్-2, కెమిస్ట్రీ-1, లైబ్రరీ సైన్స్-1, ఫిజికల్ డైరెక్టర్-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్(పీజీ)లో 50 శాతం మార్కులు, ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యాంశాలను బోధించగల వారు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు కళాశాలకు ఒర్జినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఐదు గేదెలు మృతి

రూ.3 లక్షలు నష్టం



రొంపిచర్ల: హైవే దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఐదు పశువులు మృతి చెందిన సంఘటన శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై శుక్రవారం వెలుగు చూసింది. రొంపిచర్ల గ్రామ రెవెన్యూ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొనకంచివారి పాలెం గ్రామానికి చెందిన పానుగోటి రామాంజనేయులుకు చెందిన ఐదు గేదెలు మేతకు వెళ్లాయి. గేదెలు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాయి. మృతి చెందిన వాటిలో మూడు గేదెలు, రెండు దూడలు ఉన్నాయి. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుంది. గేదెల మృతితో రూ.3 లక్షల రూపాయల వరకు రైతుకు నష్టం వాటిల్లింది.

ఉద్యోగోన్నతి ధ్రువపత్రాలు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, మున్సిపల్, నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఉద్యోగోన్నతులపై నియమితులైన ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ధ్రువపత్రాలు అందజేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జనరేట్ అయిన ఉద్యోగోన్నతుల ధ్రువపత్రాలను హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్‌ఎం ఏ.తిరుమలేష్, హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన షేక్ మొహ్మద్ ఖాసిం పాల్గొన్నారు.

చిన్నారుల సృజనకు పదను..

- ప్రమాదాల నివారణకు వినూత్న ఆలోచన
- సెన్సార్ టెక్నాలజీతో ప్రమాదాలకు చెక్

గురజాల: పల్నాడు విద్యార్థులు కొత్త ఆవిష్కరణకు ప్రాణం పోశారు. వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తరగతి గదుల్లో బట్టీచదువులు స్వస్తి చెప్పి సృజనకు పదను పెడుతున్నారు. అందుకు నిపుణుల సహకారం ఉంటే అద్భుతాలు సృష్టించేందుకు చిన్నారులు సిద్ధమయ్యారు. రహదారి ప్రమాదాలు, దొంగతనాల నివారణ దృష్టి పెట్టారు. సరికొత్త ప్రాజెక్టును ఆవిష్కరించారు.. గురజాలకు చెందిన మట్టపల్లి మన్విత రియా,కూరపాటి ఆశ్విని కీర్తి,మేకల సాయి చరణ్, మేకల అరవింద్, బండి ఆశ్మిత. రోబోటిక్ నిపుణులు ఎస్ఆర్ఎయూ డైరెక్టర్ దాసరి నరేంద్ర కుమార్ సహకారంతో ముందుకు సాగారు.

చిన్నారుల లక్ష్యం..

రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఒంటరి వారవుతున్న జీవితాలను చూసి చలించిపోయారు. దీంతో ఆ చిన్నారుల మనస్సులో ప్రమాదాలు నివారించాలనే ఆలోచన తట్టింది. సెన్సార్ టెక్నాలజీతో కొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. రూపొందించేందుకు నెల రోజుల వ్యవధి కాగా రూ.5వేలు ఖర్చు చేసినట్లు చిన్నారులు చెబుతున్నారు.

పనిచేసే విధానం..

వాహనం స్టార్ట్ చేయడానికి ముందుగానే హెల్మెట్ ధరించాలి. వాహనదారుడు వాహనం ఎక్కాగానే హెల్మెట్ ధరించాడా లేదా అని గుర్తు చేస్తుంది. హెల్మెట్‌లో ఏర్పాటు చేసిన సెన్సార్ వ్యవస్థ బైక్‌కు అనుసంధానమై ఉంటుంది. హెల్మెట్ ధరించకపోతే వాహనం ముందుకు సాగదు. స్మార్ట్ హెల్మెట్‌లో మైక్రో కంట్రోలర్, బ్లూటూత్ మాడ్యూల్, ప్రెషర్ సెన్సార్, వంటి అత్యాధునిక పరికరాలను ఉపయోగించారు. హెల్మెట్‌లోని ప్రెషర్ సెన్సార్ హెల్మెట్ ధరించినప్పుడు సిగ్నల్‌ను బైక్‌కు వస్తుంది. ఈ సిగ్నల్ వచ్చిన తరువాతనే వాహనం స్టార్ట్ అవుతుంది. ఈ చిన్నారులు ప్రవేశపెట్టిన తీరు ప్రతి ఒక్కరిని అబ్బురపరుస్తుంది.



పనిచేసే విధానాన్ని పరిశీలిస్తున్న రెంటచింతల ఎస్ఐ నాగార్జున



నరేంద్ర కుమార్‌తో చర్చిస్తున్న విద్యార్థినులు

యాంటీ థెఫ్ట్ అలారం..

స్మార్ట్ హెల్మెట్, బైక్ థెఫ్ట్ అలారం పరికరాలు వాహనం యజమానికి సెక్యూరిటీని పెంచే కొత్త మార్గాన్ని అందిస్తున్నాయి. ఈ హెల్మెట్, బైక్ ట్రాకింగ్ సిస్టమ్‌తో అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా బైక్‌ని దొంగిలించడానికి ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగుతోంది. వాహనం ఎక్కడున్నా తమ బైక్ సురక్షితంగా ఉందా లేదా అని తెలియచేస్తుంది. వాహన చోదకుడికి అలసటగా ఉన్నా.. వాహనం అదుపు తప్పుతున్న వెంటనే సమాచారం ఇస్తుంది. కొంత భాగంలో హెల్మెట్ కూడా డేటా యాక్సెస్ ఇవ్వడం ద్వారా యజమానికి వెంటనే సమాచారం వస్తుంది.

ఎమ్మెల్సీ కార్యాలయంలో కారు చోరీ చేసిన దొంగ అరెస్టు

వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కార్యాలయంలో కారు చోరీ చేసి పరారైన ఘటనలో వ్యక్తిని అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ శుక్రవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 28వ తేదీన కడప జిల్లా కలసపాడు మండలం ఎగువ రామాపురం గ్రామానికి చెందిన పనకనపల్లి రాంప్రసాద్ రెడ్డి 2009-2014 వరకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఎస్ఆర్ఐ అగ్రిటెక్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేశాడు. అక్కడ నుంచి హైదరాబాద్‌లో ఓలా క్యాబ్, అలాగే మరి కొన్ని చోట్ల డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగించాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా మరలా తిరిగి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వద్ద పనిచేసేందుకు ఈనెల 28వ తేదీన గుంటూరు విద్యానగర్‌లోని రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఎస్ఆర్ఐ అగ్రిటెక్ సంస్థకు చెందిన వైస్ చైర్మన్ సాంబశివరావు వద్దకు వచ్చి పని కావాలని అడిగాడు. ప్రస్తుతం పనిలేదని ఆయన చెప్పాడు. కొద్ది రోజుల తరువాత చూద్దాం అని చెప్పడంతో కడప నుంచి వచ్చానని, రెండు రోజుల ఇక్కడే ఉండి వెళ్తానని చెప్పాడు. గతంలో ఉన్న పరిచయాల వల్ల ఆఫీస్ వద్దనే ఉన్నాడు. అయితే అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ డ్రైవర్‌గా పని చేసే సంతవరపు నాగార్జున ఏపీ 07జెడ్ 2137 నంబర్ గల కారును కార్యాలయం వద్ద పార్కింగ్ ప్రదేశంలో పెట్టి తాళాలు కార్యాలయంలో పెట్టి వాచ్‌మెన్‌కు చెప్పి వెళ్లిపోయాడు. తరువాత రాత్రి ఒంటి గంట సమయంలో హైదరాబాద్ ఉన్న రాంప్రసాద్‌రెడ్డి కారును, వాచ్‌మన్ సెల్‌ఫోన్‌ను చోరీ చేసి పరారైయ్యాడు. దీంతో కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గుజ్జనగుండ్ల సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో చోరీ చేసిను కారులో ఉన్న రాంప్రసాద్‌రెడ్డి కారును ఆపి పారిపోయే ప్రయత్నం చేస్తున్న క్రమంలో పోలీసులు రాంప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో విచారించగా హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్ మెట్‌లో ఉన్న ప్రియురాలిని కలసి, కారు తిరిగి ఇచ్చేద్దామని వస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు అంగీకరించాడు. దీంతో చోరీ చేసిన రాంప్రసాద్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. చాకచక్యంగా పట్టుకున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, క్రైం సిబ్బంది ఆంజనేయులు, ప్రసాదరావు, శ్రీనివాసరావును జిల్లా ఎస్పీ అభినందించారు.



దొంగను అరెస్ట్ చూపుతున్న వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు వసూలు

– నిందితుడి అరెస్ట్

నూతనకల్: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామానికి చెందిన దాసరి మహేష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఏసీ మెకానిక్, వోల్వో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న మాదాసు వరప్రసాద్ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. మహేష్ తమ్ముడు సతీష్‌కు ఓల్వో బస్ డ్రైవింగ్ నేర్పించి డ్రైవర్‌గా జాబ్ ఇప్పిస్తానని వరప్రసాద్ ఫోన్‌లో తెలిపాడు. ఈమేరకు రూ.4లక్షల 30వేలు తన ఫోన్‌పే ఖాతాలోకి కొట్టించుకున్నాడు. ఉద్యోగ విషయమై పలుమార్లు మహేష్ వరప్రసాద్‌ను అడగగా సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. తనకు జరిగిన మోసంపై మహేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సలహా మేరకు తప్పకుండా ఉద్యోగం ఇప్పించాలని మరి కొంత డబ్బు ఇస్తానని, సూర్యాపేటకు రావాలని మహేష్ చెప్పాడు. నిందితుడు సూర్యాపేట కొత్తబస్టాండ్‌కు రావడంతో పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అవినీతిపై విచారణ

- ఈపూరులో విచారణ చేపట్టిన పీడీ
- జిల్లా కలెక్టరుకు నివేదించనున్న వైనం

వినుకొండ: అంగన్‌వాడీ ఈపూరు ప్రాజెక్టు అధికారి అరుణపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అనధికార వసూలుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ప్రతినెలా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు మామూళ్లు ఇవ్వాలని, ఈనెల 31వ తేదీ రానున్న నేపథ్యంలో అందరూ తప్పనిసరిగా డబ్బులు ఇవ్వాలని సోషల్‌మీడియాలో ఓ కార్యకర్త పోస్టు పెట్టడంతో వివాదం నెలకొంది. బొల్లాపల్లి, ఈపూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలను వ్యక్తిగతంగా విచారణ చేసి వారి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నివేదికను జిల్లాకలెక్టరు కు నివేదించనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిబంధనల ప్రకారం నడపాలని సూచించారు. ఎక్కడయినా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కోరారు.



ఈపూరు కార్యాలయంలో విచారణ చేస్తున్న ఉమాదేవి

గిరిజనులు సదస్సుల్లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోండి

- జూన్ 15 నుంచి 30వరకు అవగాహన సదస్సులు
- జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వంలోని గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ధర్తీ అభ జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏ జేజీయుఏ) పథకంపై జిల్లాలో జూన్ 15 నుంచి 30వరకు గిరిజనులకు 25స్కీములపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కె.జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని దుర్గి, మాచర్ల, అచ్చంపేట, దాచేపల్లి, బొల్లాపల్లి మండలాల్లో గిరిజన, సంబంధిత శాఖల సమన్వయంతో ఎంపీడీఓల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ సదస్సులు నిర్వహించబడతాయన్నారు. సంబంధిత మండలాల్లోని గిరిజన ప్రజలు సదస్సుల్లో పాల్గొని ఆధార్, బ్యాంకు అకౌంట్, హెల్త్‌కార్డు, గ్యాస్ కనెక్షన్, జాబ్‌కార్డు, విద్యుత్, కుళాయి కనెక్షన్లు, అటవీ భూమి సమస్యలు, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో పలువురికి స్థానం

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పెదకూరపాడుకు చెందిన షేక్ జానీని రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి, మాచర్లకు చెందిన నవులూరి చెన్నారెడ్డి, సత్తెనపల్లికి చెందిన యార్లగడ్డ కృపాకరరావులను సంయుక్త కార్యదర్శులుగా నియమించింది. గురజాలకు చెందిన చల్లా కాశీబాబును రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శి, పెదకూరపాడుకు చెందిన పులిపాటి వెంకట పవన్‌కుమార్‌ను రాష్ట్ర వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ప్రకృతి పంచిన అరుదైన వనరులను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని కన్జర్వేటివ్ రిజర్వ్‌గానూ, మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగానూ మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు పంపామన్నారు. వీటిని గ్రామ సభల ద్వారానూ సంబంధిత శాఖాధికారుల ద్వారా ఆమోదం లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌ఓ సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడినట్లు జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మాదారం గ్రామానికి చెందిన పాలిపోగు ప్రసాద్ (62) రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. తీవ్రమైన కడుపునొప్పి, కామెర్లు, చలిజ్వరం రావడంతో ఒంగోలులో 25 రోజులు చికిత్స తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. హైడాటిడ్ సిస్ట్ వ్యాధి (కాలేయంలో నీటిబుడ్డ)తో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. కుక్కల వల్ల, కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధి వస్తుందన్నారు. కొన్నిసార్లు మాంసం పూర్తిగా ఉడకకుండా తినడం వల్ల కూడా వస్తుందని చెప్పారు. ప్రసాద్ కాలేయం, ఇతర అవయవాలకు ఇబ్బంది ఉండటంతో సర్జరీ చేశామని, దీనికి నాలుగు గంటల సమయం పట్టిందన్నారు. సుమారు 40 రోజులపాటు వార్డులో చికిత్స అందించి డిశ్చార్జి చేశామన్నారు. సుమారు రూ.10 లక్షల ఖరీదైన ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాదిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, పోలయ్య, శ్యాంసన్, శ్వేత, ప్రసాద్, హనుమంతరావు, నర్సింగ్ సిబ్బంది రాజ్యలక్ష్మి, స్రవంతి, అనిత, ఉష, నంద పాల్గొన్నట్లు వెల్లడించారు. వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ అభినందించారు.

పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్

తెనాలి రూరల్: లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిరాటంకంగా అమలు చేస్తూ దళిత, మైనార్టీ యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన సీఐలు, ఇతర పోలీసు సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, షెడ్యూల్ట్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి అందే శ్యాం డిమాండ్ చేశారు. తెనాలి ఐతానగర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వారు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఐతానగర్ దళితులు క్రిమినల్, గంజాయి కేసుల్లో ఉన్నందున పోలీసులు బహిరంగంగా ట్రీట్మెంట్ ఇవ్వడం సరైందేనని అధికార పార్టీ పత్రికల ద్వారా, వారి అడుగులకు మడుగులొత్తే మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయించారని ఆరోపించారు. బాధ్యులైన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పొగాకు.. ఆరోగ్యానికి చేటు

- నేడు నో టుబాకో డే
- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగాకు వినియోగంతో అనేక నష్టాలు

గుంటూరు మెడికల్: యవ్వనంలో సరదా కోసం మొదలుపెట్టే ధూమపానం చివరకు ప్రాణాలనే హరిస్తుంది. సిగరెట్, బీడీ, చుట్ట తాగే అలవాటు వ్యసనంలా మారి మనిషిని బానిసను చేసుకుంటుంది. స్మోకింగ్, పొగాకు ఉత్పత్తుల మోజులో పడి యువత భవిష్యత్తును అంధకారం చేసుకుంటోంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులలో 40 శాతం మంది పొగతాగటం, పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారానే వ్యాధి బారిన పడి మరణిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ధూమపానంతో కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రపంచ వ్యాప్తంగా మే 31వ తేదీన నో టుబాకో డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

జిల్లాలో బాధితులు అధికమే...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం 35 శాతం మంది యువత ధూమపానం చేస్తున్నారు. వివిధ రోగాలతో 30 – 39 ఏళ్ల వయస్సు వారిలో చనిపోతున్న ప్రతి ఐదుగిరిలో ఒకరు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్లేనని తేలింది. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి నెలా 1,200 మంది పురుషులు, 2 వేల మంది మహిళలు వివిధ రకాల క్యాన్సర్‌లతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 శాతం మంది కేవలం పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. జిల్లాలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించేందుకు 15 ఆస్పత్రులు, క్లీనిక్‌లు ఉన్నాయి. వీటిల్లో రోజూ 400 మంది వరకు క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు.

చట్టం ఏం చెబుతోందంటే..

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం రైల్వే స్టేషన్‌లు, సినిమా హాల్స్, బస్ స్టేషన్‌లు, జనసంచారం ఉండే మార్కెట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదు. ముఖ్యంగా పాఠశాలలు, గుడులకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మటం చట్టరీత్యా నేరం. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు చట్టరీత్యా విక్రయించకూడదు. చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తారు. ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మాత్రమే ధూమపానం చేసేందుకు అనుమతించాలి.



పొగాకు అలవాటు మానేయాలనుకునే వారికి ఔషధాలు

జీజీహెచ్‌లో ఉచిత కౌన్సెలింగ్

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో పొగాకు ఉత్పత్తుల అలవాటు మానేయాలనుకునే వారికి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి, ఔషధాలు ఇస్తున్నారు. 2019 నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది 1,263 మందికి చికిత్స అందించడం ద్వారా కొంత మంది స్మోకింగ్ అలవాటు మానేశారు. స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఛాతీ ముందు భాగంలో, భుజానికి, తొడకు.. ఇలా ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని చోట నికోటిన్ ట్రాన్స్‌థర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. ఈ ప్యాచ్ అంటించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా ప్రతి నెలా పది మందికి పైగా పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేస్తున్నట్లు గుర్తించామని సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్ తెలిపారు.



నో టుబాకో డే పోస్టర్


పొగాకు వినియోగంతో క్యాన్సర్



క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే వారిలో 40 శాతం మంది పొగాకు, దాని ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నవారే. పొగతాగటం, పొగాకు ఉత్పత్తులైన ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి వాటిని వినియోగించటం వల్ల నోరు, గొంతు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. చికిత్స తీసుకుని త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ధూమపానంతో గుండెజబ్బులు



పొగతాగే వారిలో రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొగాకులో 400 రకాల విషపదార్థాలు ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ వల్ల గుండెపోటు, టార్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. నపుంసకత్వం, పక్షవాతం పొగరాయుళ్లను వదలవు. పొగతాగే వారికి చుట్టుపక్కల ఉన్నవారిపై కూడా పొగాకు ప్రభావం ఉంటుంది. గుండె జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చే వారిలో 70 శాతం మంది ధూమపానం చేసేవారే.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

తోడికోడళ్లకు మంత్రి మనోహర్ నివాళి

తెనాలిరూరల్: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సమీపంలోని హైవేపై గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తోడికోడళ్లు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. కన్నెగంటి సూర్య కుమారి, కన్నెగంటి సరస్వతి కుమారి, కన్నెగంటి ఝాన్సీరాణిల మృతదేహాలు శుక్రవారం సాయంత్రం తెనాలికి చేరుకున్నాయి. నందులపేటలోని కవిరాజ పార్కు రోడ్డులో అక్షరగీత విద్యానికేతన్ వద్ద బంధువుల సందర్శనార్థం మృతదేహాలను ఉంచారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మృతదేహాలకు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.



మృతులకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

10 మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లాలోని 10 మండలాల్లో వర్షం పడింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 34.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 2.4 మి.మీ వర్షం పడింది. సగటున 6.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మే నెల 30వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 60.2 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 195.7 మి.మీ వర్షపాతం నమోదైంది.